డెంగ్యూతో చిన్నారి మృతి

రుషిత (ఫైల్)

హుజూరాబాద్, సెప్టెంబర్ 30 : డెంగ్యూతో పదేండ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సోమవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన రావుల వెంకటేశ్వర్లు, రజని దంపతులకు కొడుకు, కూతరు రుషిత(10) ఉన్నారు. రుషితకు వారం రోజుల క్రితం జ్వరం రాగా స్థానిక వైద్యులకు చూపించారు. జ్వరం తగ్గకపోవడంతో రెండ్రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి డెంగ్యూ అని నిర్ధారించారు. వైద్యం చేస్తుండగానే రక్తకణాలు పూర్తిగా పడిపోవడంతో బాలిక మృతిచెందింది. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. రిషిత గ్రీన్ సెడ్జ్ (వీపీఎస్) స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నది.

స్కూల్ బస్సు ఢీకొని చిన్నారి దుర్మరణం

మనోజ్ఞ (ఫైల్)

ముస్తాబాద్, సెప్టెంబర్ 30 : స్కూల్లో ముందస్తు బతుకమ్మ వేడుకల కోసం కొత్త దుస్తులు ధరించి సంతోషంగా వెళ్లిన చిన్నారి అదే స్కూల్ బస్సు కిందపడి ప్రాణాలు విడిచింది. ఈ విషాదకర ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో సోమవారం జరిగింది. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన భూమ రాజు – వెంకటలక్ష్మి దంపతులకు కూతు రు మనోజ్ఞ (5) ముస్తాబాద్‌లోని మహర్షి స్కూల్లో నర్సరీ చదువుతున్నది. సోమవారం బస్సులో స్కూల్‌కు వెళ్లింది. బస్సు దిగి వెనుక నుంచి వెళుతున్న క్రమంలో డ్రైవర్ చూడకుండా రివర్స్ తీయడంతో చిన్నారి వెనుక టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ, డీవైఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు.

సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, గంగుల, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు

కాంగ్రెస్‌కు మూసీ బ్యాంకు

- 2400 కి.మీ. 'నమామి గంగ'కు 40 వేల కోట్లు
- 55 కిలోమీటర్ల మూసీకి 1.50 లక్షల కోట్లా?
- మూసీ బాధితుల పాలిట కాలయముడిలా రేవంత్
- రెడ్‌లైన్లు వేసుడు కాదు.. డెడ్‌లైన్లు పెడుతం
- ఢిల్లీ పార్టీలను గెలిపిస్తే గల్లీ ప్రజలకు ఆక్రందనలే
- బుల్డోజర్‌కు అడ్డుగా నిలుస్తాం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ చెప్తున్న మూసీ సుందరీకరణ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వచ్చే సాధారణ ఎన్నికల కోసం ఈ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రిజర్వ్ బ్యాంకులా, ఏటీఎంలా ఉపయోగపడుతుందని దుయ్యబట్టారు. మూసీ ప్రాజెక్టును ఎవరి కోసం చేపడుతున్నారో చెప్పాలని, అసలు కాంగ్రెస్ సర్కార్ ప్రాధాన్యాలు ఏమిటో చెప్పాలని నిలదీశారు. 300 రోజులైనా కాంగ్రెస్ హామీలు అమలు కావడంలేదని, ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలకు అక్కరకు రాని అంశంపై లక్షన్నరకోట్లు ఖర్చు పెట్టడం ఎవరికోసమని ప్రశ్నించారు. పేదల పక్షాన హైకోర్టుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'రెండు వేల పింఛన్ నాలుగు వేలవుతుందని, రెండు లక్షల రుణమాఫీ అని, తులం బంగారంతో కల్యాణలక్ష్మిని అమలు చేస్తామని, 10వేల నుంచి 15 వేలకు రైతుబంధు పెంచుతామని, ఆటో డ్రైవర్లకు నెలకు వెయ్యి, మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పారు.. వీటికి మాత్రం పైసల్లేవు, చేతులు రావు.. ఇవన్నీ ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వకుండా అక్కరకు రాని, అక్కరలేని, ప్రజలు కోరుకోని సుందరీకరణ కోసం, ఏ ప్రాధాన్యం లేకుండా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడుతామంటే ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇందులో ఏం ఆశించి చేస్తున్నారో చెప్పాలి' అని నిలదీశారు. ఓవైపు ఖజానాలో పైసల్లేవంటూనే అప్పుల కోసం అప్పులు తేవాల్సి వస్తున్నదని ఉప ముఖ్యమంత్రి చెప్తున్నాడని, ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. '25వేల కుటుంబాలు, లక్ష మందిని నిరాశ్రయులను చేసేందుకు మూసీ బాధితుల పాలిట ముఖ్యమంత్రి కాలయముడిలా మారాడు' అని మండిపడ్డారు. నేరం చేసిందెవరు? శిక్ష ఎవరికి వేస్తున్నారు? అని ప్రశ్నించారు. 1994లో కాంగ్రెస్ సర్కార్ ఉన్నప్పుడే పట్టాలిచ్చారని, రిజిస్ట్రేషన్లు అయ్యాయని, అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నామని, రిజిస్ట్రేషన్లు చేసుకున్నప్పుడు, నిర్మాణాలకు అనుమతులిచ్చినప్పుడు, ఇంటి పన్ను కట్టించుకున్నప్పుడు, కరెంటు కనెక్షన్ ఇచ్చినప్పుడు, మంచి నీళ్ల బిల్లు కట్టుమన్నప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని బాధితులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సమాధానం ఉన్నదా? అని నిలదీశారు.

మొదట వారిపై చర్యలు తీసుకోండి

ప్రభుత్వానికి దమ్ముంటే, చేతనైతే వీటికి అనుమతినిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైకోర్టు కూడా ఇదే చెప్పిందని గుర్తుచేశారు. 'కూల్చాల్సి వస్తే మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్, ఆ తర్వాత జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం.. ఈ రెండూ నాలా మీద కట్టారు' అని తెలిపారు.

రాహుల్, ప్రియాంక ఎక్కడ?

మూసీ బాధితులు ఆక్రందనలు చేస్తుంటే కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎక్కడ? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు అశోక్‌నగర్‌లో చాయ్ తాగి, బిర్యానీ తిని ఓట్లు దండుకున్నారని దుయ్యబట్టారు. వారిప్పుడు ఏమయ్యారని నిలదీశారు. ఢిల్లీ పార్టీలను ఎప్పుడు గెలిపించినా గల్లీ ప్రజల ఆక్రందనలు ఇలానే ఉంటాయని ఉదహరించారు. 'మూసీ ప్రాజెక్టు వల్ల మురిసేది ఎంత మంది?, రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత?, మూసీ వల్ల ఒక్క ఎకరానికైనా సాగు నీరు వస్తుందా?, ఒక్క రైతుకైనా అదనంగా నీరందుతుందా? ఒక్క రిజర్వాయర్ అయినా వస్తుందా?.. ఏమీ లేకున్నా లక్షన్నర కోట్లు అంటే స్కాం కాదా' అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కాళేశ్వరం బీఆర్‌ఎస్‌కు ఏటీఎం అన్నారని, మరీ మూసీ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు ఏటీఎం కాదా? అని నిలదీశారు. ఇది దేశంలోనే అతి పెద్ద కుంభకోణం కాదా? అని ప్రశ్నించారు.

వాటికే అంతయితే..

నమామి గంగే ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు, సబర్మతి రివర్ ఫ్రంట్‌కు రూ.7,050 కోట్లు, యమున రివర్ ప్రాజెక్టుకు రూ.1000 కోట్లు ఖర్చయితే మూసీకి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చట? అని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. థేమ్స్ నది ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. 'ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్లు కట్టిస్తారని ఓట్లు వేశారు.. పేదల ఇండ్లు కూలగొడుతామని ముందే చెప్పి ఉంటే ఒక్కరంటే ఒక్కరు కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తుండేనా?' అని ప్రశ్నించారు.

నీ జాగీరా

'అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న ప్రజల ఇండ్లను కూలగొడుతామంటే బీఆర్‌ఎస్ ఉరుకోదు.. వారికి అండగా నిలబడుతాం. బుల్డోజర్లు వస్తే వాటికి ఎదురుగా మేమే నిలబడుతాం' అని కేటీఆర్ ప్రకటించారు. సమావేశంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, బీఆర్‌ఎస్ నేతలు కార్తీక్‌రెడ్డి, తుల ఉమ పాల్గొన్నారు.

ఇల్లు అనేది ఎమోషన్

'పేద, మధ్య తరగతి వారికి జీవితకాలం చేసిన కష్టానికి ప్రతీరూపం ఇల్లు. ఇల్లు అనేది ఒక ఎమోషన్. ఆ కుటుంబం మొత్తం కలలుగనే ఒక సౌధం, అది నాలుగు ఇటుకలు, రెండు రాళ్లతో కట్టిన కట్టడం కాదు.. ఇల్లు అనేది జ్ఞాపకాల పొదరిల్లు' అని కేటీఆర్ గుర్తుచేశారు. 'ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామంటే ఎంత బాధ ఉంటదో రేవంత్‌రెడ్డికి తెలియక పోవచ్చు కానీ నాకు తెలుసు. కేసీఆర్ కుటుంబం ఒక్కసారి కాదు.. రెండు సార్లు డిస్‌ప్లేస్ అయింది. నానమ్మకు చెందిన పోసాన్‌పల్లి అప్పర్ మానేరు డ్యాంలో 1940లో మునిగిపోతే చింతమడకకు వచ్చాం. అమ్మమ్మ గ్రామం మిడ్ మానేరులో మునిగిపోయింది. మా జ్ఞాపకాలు, ఇండ్లు అన్నీ అక్కడే పోయాయి' అని గుర్తుచేసుకున్నారు. ఊరు, ఇంటిలో అల్లుకున్న జ్ఞాపకాలు, ఆశలు, ఆకాంక్షల విలువ రేవంత్‌రెడ్డికి తెలియకపోవచ్చు నన్నారు. కాంగ్రెస్ వాళ్లు సునీల్ కనుగోలు డైరెక్షన్‌లో 500 మందిని సోషల్ మీడియాలో పెట్టి బాధితులంతా ఆక్రమణదారులని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

కొనుక్కునే సంస్కృతి మీది..

ఐదు వేలు తీసుకొని మూసీ బాధితులు మాట్లాడుతున్నారంటూ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.50 కోట్లకు పీసీసీ ప్రెసిడెంట్ పదవి, రూ.500 కోట్లకు సీఎం పదవి అమ్ముకోవడం, మంత్రులు పర్సంటేజీలు పంచుకోవడం లాంటి కాంగ్రెస్ దిక్కుమాలిన అలవాట్లు ప్రజలకు ఉండవని ఎద్దేవా చేశారు. 'ఆత్మగౌరవం మీద కొడితే తెలంగాణ ప్రజలు తిరగబడుతరు.. వాళ్లు తిరగబడితే కాంగ్రెస్ వాళ్లు ఉళ్లలో తిరగలేని పరిస్థితి వస్తుంది' అంటూ హెచ్చరించారు. మంత్రి శ్రీధర్ బాబు మీద కొంత గౌరవం ఉండేదని, ఆయన మాటలతో గౌరవం పోయిందని చెప్పారు.

హనుమకొండ జిల్లా ఐనవోలులోని కేజీబీవీలో కరెంట్ పోవడంతో చీకటిగా మారిన గది

కలెక్టర్ సాక్షిగా 'కస్తూర్బా'లో కరెంట్ కట్

ఐనవోలు, సెప్టెంబర్ 30: హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం కలెక్టర్ ప్రావీణ్య ఉండగానే విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో కొన్ని క్లాసుల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కలెక్టరే స్వయంగా ఆదేశించిన 20 నిమిషాల తరువాత విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడం చర్చనీయాంశంగా మారింది.

3న ట్రిపుల్ ఆర్ బాధితుల మహాధర్నా

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 30 (నమస్తేతెలంగాణ) : ట్రిపుల్ ఆర్‌లో అలైన్‌మెంట్‌లో మార్పులు చేర్పులు, నష్టపరిహారం పెంపు తదితర డిమాండ్లతో ట్రిపుల్ ఆర్ బాధితులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ 3న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టనున్నారు. వ్యవసాయ భూములు, ఇండ్లు, ప్లాట్లు, వాణిజ్య భవనాలు, ఇతర ఆస్తులను కోల్పోతున్న బాధితులంతా రైతు ఐక్యవేదికగా ఏర్పడి ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు. చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం, భువనగిరి తదితర మండలాల్లోని బాధితులతోపాటు గజ్వేల్, సంగారెడ్డి ప్రాంత నిర్వాసితులు కూడా తరలివచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మహాధర్నాకు సంబంధించి ఇప్పటికే పోలీసుల నుంచి అనుమతి కూడా పొందినట్టు తెలిసింది. ఈ ధర్నాకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీల రాష్ట్ర ముఖ్యనేతలతోపాటు రైతు సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నారు. సోమవారం విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కీలక నేతలను కలిసి మహాధర్నాలో పాల్గొనాలని కోరారు. తమకు సంఘీభావంగా తరలివచ్చి అలైన్‌మెంట్లలో మార్పులు చేర్పు లు, పరిహారం విషయంలో మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. మహాధర్నాకు పెద్దసంఖ్యలో తరలివెళ్లి ధర్నాచౌక్ దద్దరిల్లేలా చేసి ప్రభుత్వం దిగివచ్చేలా చేయడమే తమ లక్ష్యమని రైతు ఐక్య వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు.

• తాగునీటి కోసం గిరిజనుల నిరసన

మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెంలోని పలు కాలనీలవాసులు సోమవారం నిరసన తెలిపారు. నీటి ట్యాంకు ఉన్నా.. పంపులు రాకపోవడంతో చేతి పంపులను ఆశ్రయించాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. – టేకులపల్లి

మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

చెలిమిల్లలో కమ్యూనిటీ కాంటాక్ట్

పెబ్బేరు, సెప్టెంబర్ 30 : పెబ్బేరు మున్సిపాలిటీంలోని చెలిమిల్లలో సోమవారం రాత్రి పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ సెర్చ్) కార్యక్రమం నిర్వహించారు. వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన ఇద్దరు సీఐలు, ఎనిమిది మంది ఎస్సైలు, 50 మంది పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 50 వాహనాలను పరిశీలించగా వాటిల్లో నాలుగింటికి పత్రాలు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై హరిప్రసాదరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు విందు భోజనాలు

భోజనాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

అలంపూర్, సెప్టెంబర్ 30 : అలంపూర్ మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సోమవారం విందు భోజనాలు ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం కొనసాగుతున్నది. అందులో భాగంగా మున్సిపాలిటీలో సోమవారం పారిశుధ్య పనుల అనంతరం కార్యాలయంలో కార్మికులకు సామూహిక విందు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది కార్మికులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈవో తనిఖీ

కేటీదొడ్డి, సెప్టెంబర్ 30 : మండలంలోని రంగాపురం, మైలగడ్డ, గువ్వలదిన్నె, వాగుతండా, గంగన్‌పల్లి గ్రామాల్లోని పాఠశాలలను మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం జరిగినటు వంటి న్యాస్ టెస్ట్ టూను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వర్, సీఆర్‌పీలు యుగేందర్ ఉన్నారు.


గువ్వలదిన్నె పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

జోనల్ స్థాయికి ఎంపికైన విద్యార్థులు

ఉండవెల్లి, సెప్టెంబర్ 30 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ గేమ్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14,17 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో గద్వాల జిల్లాలోని ఆయా మండలాల నుంచి 24 టీమ్‌ల విద్యార్థులు హాజరై కబడ్డీ పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లును జోనల్ స్థాయికి ఎంపికయ్యారు. జోనల్ స్థాయికి ఎంపికైన విద్యార్థులు అండర్– 17 కేటీదొడ్డి మండలం ప్రథమ విజేత, రెండో విజేతగా ధరూర్ మండల విద్యార్థులు, అండర్–14 ప్రథమ విజేతగా గద్వాల మండల విద్యార్థులు, రెండో విజేతగా కేటీదొడ్డి మండల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లతోపాటు గోల్డ్ మెడల్స్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి ఆనంద్, స్కూల్‌గేమ్ ఫేడరేషన్ కార్యదర్శి జితేందర్, రాజోలి ఎంఈవో భగీరథరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఫిజికల్ డైరెక్టర్లు భరత్‌కుమార్, శైలజ, శ్రీనివాసులు, బీసన్న, రజనీకాంత్, మాజీ సర్పంచ్ రేఖవెంకట్‌గౌడ్, అన్నదాత ఉసేన్ విద్యుత్ లైన్‌మేన్, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో మాస్టర్ సుధీర్‌కుమార్

జోనల్ స్థాయికి ఎంపికైన అండర్–17 విద్యార్థులు

రాష్ట్ర స్థాయి పోటీలకు అయిజ క్రీడాకారులు

అయిజ, సెప్టెంబర్ 30 : రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు అయిజ క్రీడాకారులు ఎంపికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జోనల్‌స్థాయి పోటీల్లో జస్వంత్, రామ్‌తేజ్, రోహిత్ స్మిత్, పర్శ, వీరేశ్‌లు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తైక్వాండో మాస్టర్ సుధీర్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు.

ఫారెస్ట్‌లో మేపేందుకు అనుమతివ్వాలి

పాన్‌గల్, సెప్టెంబర్ 30 : మండలంలోని శాగాపూర్ ఫారెస్ట్‌లో గొర్రెలను మేపేందుకు అనుమతివ్వాలని సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో గొర్రెల పెంపకందారుల సంఘం నాయకుడు సుబ్బయ్యయాదవ్ కలెక్టర్ ఆదర్శ సురభికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో దాదాపుగా 8 వేల గొర్రెలు ఉన్నాయని, వాటి మేతకు పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంజీకేఎల్ఐ డీ–8, భీమా కాల్వలకు సాగునీరు రావడంతో రైతుల పొలాలు సాగులో ఉన్నాయని, అందుకే అడవిలోకి తీసుకెళ్లేందుకు అనుమతివ్వాలన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గట్టు, సెప్టెంబర్ 30 : గొర్లఖాన్‌దొడ్డి–తప్పెట్లమొర్సు రోడ్డుపై ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో కర్ణాటకలోని కురిడికి చెందిన చిన్న(30) తీవ్రగాయాలకు గురైన సంగతి తెలిసిందే. కాగా చికిత్స పొందుతూ ఆయన కర్నూలు ప్రభుత్వ దవాఖానలో సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కేటీ మల్లేశ్ తెలిపారు.

పాఠశాలకు ఆనుకొని మూత్రశాలలు నిర్మించొద్దు

ఉండవెల్లి, సెప్టెంబర్ 30 : మండలకేంద్రంలోని ప్రాథమిక, జెడ్పీ పాఠశాలలకు అనుకొని పబ్లిక్ టాయిలెట్లు నిర్మించొద్దని ఎంపీడీవో తిరుపతన్నకు సోమవారం ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలకు అనుకొని మూత్రశాలలు నిర్మించేందుకు పంచాయతీ కార్యదర్శి, మండల ప్రత్యేకాధికారి తీర్మానం చేశారన్నారు. వాటిని నిర్మిస్తే పాఠశాల విద్యార్థులకు అసౌకర్యంగా ఉంటుందని, భోజనానికి ఇబ్బందిగా ఉంటుందన్నారు. నాలుగు ప్రధాన రోడ్లు కలిసి ఉండడంతో మహిళలు మూత్రశాలలకు వెళ్లేందుకు అనువుగా ఉండదన్నారు.

మైక్ సెట్, సౌండ్ బాక్స్ వితరణ

గోపాల్‌పేట, సెప్టెంబర్ 30 : జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త ఎస్‌ఎల్‌ఎన్ రమేశ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సోమవారం తమ సొంత ఖర్చుతో మైక్‌సెట్, సౌండ్ బాక్స్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాకాంత్, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

కేటీదొడ్డి, సెప్టెంబర్ 30 : మండలంలోని రంగాపురం యూపీఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. సోమవారం ఉదయం 10 గంటల వరకు ఏ ఒక్క ఉపాధ్యాయుడు విధులకు హాజరు కాలేదు. ఎంవో వెంకటేశ్వర్‌రావు పాఠశాలను తనిఖీ చేయడానికి వెళ్లగా ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆయనే విద్యార్థులతో ఉదయం 9గంటలకు ప్రార్థన చేయించి తరగతి గదిలోకి పంపించారు. ఇలాంటి ఘటన ప్రతి రోజూ జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు సమయపాలన పాటించకుండా నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయంపై ఎంఈవో వెంకటేశ్వర్‌రావును వివరణ కోరగా రంగాపురం పాఠశాల ఉపాధ్యాయులు 5 నిమిషాలు లేటు వచ్చినట్లు తెలిపారు. మండలంలోని ఏ పాఠశాలలో అయిన ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.


రంగాపురం పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్‌రావు

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

మల్దకల్, సెప్టెంబర్ 30 : గర్భిణులకు పౌష్టికాహారం అందించడంతోపాటు.., తమ పరిధిలోని చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించేలా టీచర్లు కృషి చేయాలని సీడీపీవో నాగరాణి సూచించారు. సోమవారం పోషణ మాసంలో భాగంగా మండలకేంద్రంలోని రైతువేదికలో అంగన్‌వాడీ టీచర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ గర్భిణులు, కిశోర బాలికలకు పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. కిశోర బాలికలు ఒత్తిడికి లోనుకాకుండా చదువుపై దృష్టి సారించేలా చూడాలన్నారు. 3–5 ఏండ్ల చిన్నారులకు అక్షరమాల, వర్ణమాల అంకెలను కచ్చితంగా నేర్పించాలన్నారు. అనంతరం చిన్నారులతో అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యామిని, సంధ్యారాణి, వాసంతి, వెంకటేశ్వరమ్మ, తెల్లమ్మ, శశికళ, మల్దకల్, అయిజ, గట్టు మండలాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

టోల్‌గేట్ ఉద్యోగిని విధుల్లోకి తీసుకోవాలి

టోల్‌గేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు

ఉండవెల్లి, సెప్టెంబర్ 30 : మండలంలోని పుల్లూరు టోల్‌గేట్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ టోల్‌గేట్ ఉద్యోగులపై యజమాన్యం వెట్టిచాకిరీ చేయించుకుంటుందని, ఇదేమిటని ప్రశ్నించిన హుస్సేన్‌బాషాను విధుల నుంచి తొలగించారన్నారు. అతడిని 30 రోజుల తర్వాత విధుల్లో చేర్చుకుంటామని హామీ ఇచ్చి.. ఇప్పుడు తీసుకోకపోవడంతో నిరసన తెలిపామన్నారు. కార్యక్రమంలో టోల్‌గేట్ యూనియన్ అధ్యక్షుడు పీటర్, ప్రధాన కార్యదర్శి మద్దయ్య, ఉద్యోగులు రాజశేఖర్, వెంకటేశ్, లాజర్, వెంకట్రాముడు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 30 : నడిగడ్డలో యువత మత్తుకు బానిసలై వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మత్తు పదార్థాల బహిష్కరణకు ఒక రోజు నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ నడిగడ్డ ప్రాంతంలో యథేచ్ఛగా నిషేధిత డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు రాజ్యమేలుతుందని, అక్రమార్కులు పెద్ద మొత్తంలో మత్తు పదార్థాలను సరఫర చేయడంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు బుచ్చిబాబు, రంగస్వామి, వెంకట్రాములు, లవన్న, శ్రీనివాస్ ఉన్నారు.

కేసు నమోదు

గద్వాలరూరల్/గద్వాల అర్బన్, సెప్టెంబర్ 30 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితపై లైంగిక దాడి జరిగింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బాధిత మహిళ 26వ తేదీన సాయంత్రం ఇంటి వద్ద ఒంటరిగా పనులు చేసుకుంటున్న సమయంలో అదే గ్రామానికి చెందిన బీరప్ప లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఉండవెల్లి, సెప్టెంబర్ 30 : మండలంలోని పుల్లూరు గ్రామ శివారు 44వ జాతీయ రహదారికి సమీపంలో గుర్తుతెలియని మగ మనిషి మృతదేహం లభించినట్లు ఎస్సై మహేశ్ పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాలు పుల్లూరు శివారులో గుర్తుతెలియని మగ మనిషి మృతదేహం ఉన్నట్లు సమాచారం మేరకు పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి 40 ఏండ్లు, పూర్తిగా కుళిపోయిన స్థితిలో అస్తిపంజరంగా లభ్యమైంది. మృతదేహంపై నలుపు, బ్రౌన్ కలర్ గల రెండు పాయింట్‌లు ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై పేర్కొన్నారు.

కిరాణ షాపులో రూ.24 వేలు అపహరణ

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 30 : ఓ కిరాణం షాపులో వెనుక భాగం నుంచి రేకులు తొలగించి దుండగులు చోరీ చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల మేరకు జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న ఓ కిరాణం షాపులో రాత్రి దుండగులు వెనక భాగంలో రేకు పైకప్పును తొలగించి లోపలికి ప్రవేశించి రూ.24వేలు చోరీ చేశారు. బాధితుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు గద్వాల టౌన్ ఎస్సై కళ్యాణ్ రావు పేర్కొన్నారు.

పట్టపగలే చోరీ

బీరువాలో చిందరవందరగా పడి ఉన్న సామగ్రి

కేటీదొడ్డి, సెప్టెంబ ర్ 30 : పట్టపగలే చోరీ జరిగిన ఘటన మండలంలోని యర్సన్‌దొడ్డి లో చోటు చేసుకున్నది. గ్రామంలో ఎవరు లేని సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. ఎస్సై బి.శ్రీనివాసులు కథనం మేరకు యర్సన్‌దొడ్డి గ్రామంలోని రైతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవ్వరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు పలు ఇండ్లలో చోరీ చేశారు. పనులు ముగించుకుని సాయంత్రం తమ ఇండ్లకు వచ్చిన బాధితులు ఇండ్ల తాళాలు పగులగొట్టి ఉండటం గమనించారు. నాలుగు ఇండ్లలో చోరీ జరగగా మొత్తం రూ.1.63 లక్షల విలువ చేసే బంగారు అభరణాలు, నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఎస్సై శ్రీనివాసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, క్లూస్‌టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.